

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# నాకు విడాకులు వద్దు

ఆ రోజు సదస్సు జరిగింది.

'జరగకపోయినా బాగుండేది' అనుకుంది నళిని.

'ఆ సదస్సుకు నళిని హాజరైంది. వెళ్లకపోయినా బాగుండేది' అనుకున్నది.

'ఆ సదస్సులో ఆమె పేపర్ ప్రెజెంట్ చేసింది. చేయకపోయినా బాగుండేది. మనో వ్యధను తిరగదోడుకునే అవసరం ఉండేది కాదు' అనుకుంది.

'విడాకుల చట్టంలో మార్పులు రావాలా?' అన్నది ఆనాటి సభలో చర్చనీయాంశం. సభలో పాల్గొన్న ప్రతివాళ్లూ మార్పులు కావాలనే అన్నారు. మనకు పాత ఒక రోత. కొత్త ఒక వింత. అయితే కొత్త ఎప్పటికీ కొత్తగా ఉడదు. పాతబడి పోతుంది. అప్పుడు మళ్ళీ కొత్తదనం కోసం అన్వేషణ... వేదిక మీద ప్రముఖుల మధ్య కూర్చున్న నళిని మనసులో ఎన్నో ఆలోచనలు...

విడాకుల చట్టాన్ని పూర్తిగా మార్చేయాలని పలువురు ప్రముఖులు ప్రవచించారు. ఇప్పుడున్న చట్టం వల్ల విడాకులు పొందటం కష్టంగా ఉందన్నారు. భార్యాభర్తల్లో ఏ ఒక్కరికి కల్సి జీవించటం ఇష్టం లేకపోయినా, విడాకులు తీసుకునే వీలుండాలని ఇందుకు పాశ్చాత్య దేశాల్లోని పద్ధతులను గమనించాలనీ వక్తలు సూచించారు.

"అసలు ఈ చట్టం ఎందుకుండాలి? ఏడెనిమిది కారణాలు చెప్పి, ఆ కారణాల వల్ల మాత్రమే విడాకులు తీసుకోవాలి, ఇతరత్రా వీల్లేదని చెప్పటం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని అరికట్టడం కాదా? ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లో ప్రభుత్వం అనవసరంగా జోక్యం చేసుకోవటం కాదా?" అని వేదిక మీదనుంచి విద్యుల్లత ఆవేశంగా ప్రశ్నించినప్పుడు జనం చప్పట్లు కొట్టారు.

"విడాకుల సంఖ్య పెరగటానికి మగవారి అక్రమ సంబంధాలు పెరగటమే"నని మరొకరు విమర్శించారు.

"మగవారి అక్రమ సంబంధాలు – అనటంలో అర్థం లేదు. స్త్రీ ప్రమేయం లేకుండా మగవాడికి అక్రమ సంబంధం ఎలా ఏర్పడుతుంది" అని మరో వక్త చమత్కరించినప్పుడు – అందరూ ఫక్కున నవ్వారు.

"తొందరపడి పెళ్లి చేసుకోవటం – తొందర పడి విడాకులు తీసుకోవటం రెండూ మంచిది కాదు" అని ఒక అనుభవజ్ఞుడు వివరించారు.

"తొందరపడకుండా పెళ్లి చూపులు చూసిన ప్రతి అమ్మాయి గురించీ, అలా అలోచిస్తూ కూర్చుంటే – పుణ్యం కాలం పూర్తయిపోయి వార్ధక్యం వచ్చేస్తుంది మరి" అని మరొక ఆయన వ్యాఖ్యానించారు.

"అసలీ చట్టాలు, న్యాయస్థానాలు, కోర్టులు, వాద ప్రతివాదాలూ ఏమిటీ నాన్సెన్స్ అంతా... ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఫ్రెండ్‌షిప్ చేస్తారు. కోపం వచ్చినప్పుడు విడిపోతారు... దానికి కోర్టుకు వెళ్తున్నారా? అలాగే పెళ్లి కూడా ఒక స్నేహ బంధం లాంటిదే..." అన్నదో అమ్మాయి ఎంతో తేలికగా... లాజిక్ లాగుతూ.

"నిజమే తల్లీ... పెళ్లి కూడా స్నేహబంధమే అనుకుందాం, ఏడాది తరువాత పిల్లాడు పుడతాడు. మీరు విడిపోతారు సరే.. వాడు భావి భారత పౌరుడు... వాడి సంగతేమిటి?" అన్నది మరో తలనెరిసిన మహిళ.

చివరకు నళిని తన అభిప్రాయాలు చెప్పింది.

వివాహం లేకపోతే విడాకులు లేవు. కనుక ఈ రెండింటినీ విడదీయటానికి వీల్లేదు. వివాహం అనేటప్పటికి... అనేక విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుంది. ఇందులో ప్రధానంగా రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి చట్టపరమైన విషయాలు, రెండు నైతిక విలువలు, వివాహం, విడాకులు.... ఇవి వ్యక్తిగతమైన విషయాలే కావచ్చు... కానీ వ్యక్తి నైతిక విలువల మీద సామాజిక విలువలు ఆధారపడి ఉన్నాయి. భార్యాభర్తల అనుబంధం సక్రమంగా ఉన్నప్పుడు భార్యాభర్తల శారీరక, మానసిక, ఆర్థిక వికాసం సాధ్యమవుతుంది. ఆ ఎదుగుదల వల్ల పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయగలుగుతాం. మన పిల్లల్ని మనం వృద్ధిలోకి తీసుకొస్తే, సమాజం దానంతట అదే వృద్ధిలోకి వస్తుంది... అందువల్ల చట్టం జోక్యం చేసుకోక తప్పటం లేదు. అయితే.. కొన్ని పరిస్థితుల్లో వివాహం అనే చట్రంలో బిగుసుకున్న వ్యక్తి అందులో ఇమడలేక, ఉక్కిరిబిక్కిరై ఊపిరాడని పరిస్థితి ఎదురవుతుంది. అలాంటప్పుడు – విడాకులు తీసుకుని బయటపడేందుకు చట్టం వీలు కల్పిస్తోంది. చట్టానికి, నైతిక విలువకీ... సామాజిక శ్రేయస్సుకూ.. వీటి అన్నిటికీ అతీతంగా... భార్యాభర్తలను కట్టిపడేసే అంశం మరొకటి ఉంది. అది... ప్రేమ...ఇక్కడ ఇంతమంది ఉన్నారు. ఇన్ని అభిప్రాయాలను వ్యక్తం చేశారు... కానీ ఒక్కొక్కరి జీవితంలోకి తొంగిచూస్తే... ఒక్కో కథ... భార్యల్ని హింసించి వేధించే భర్తలు ఉన్నారు. డబ్బుకోసం పెళ్లాన్ని తగులబెట్టే వారున్నారు. పెళ్లాం వంక ఎవడన్నా కన్నెత్తి చూస్తే కత్తితో పొడిచేసే వాళ్లున్నారు... వీళ్లంతా ఇష్టం లేకున్నా ఎందుకు కల్సి కాపురం చేస్తున్నారు? దీనికి సమాధానం కోసం ఎవరి అంతరాత్మను వాళ్లు అడిగి చూడండి.. చట్టానికీ, నైతిక విలువకూ, ప్రేమకూ, సామాజిక శ్రేయస్సుకూ.. వీటి అన్నిటినీ మించిన అంశం మరొకటి ఉంది. సంప్రదాయం. సంప్రదాయాన్ని కాదని... నలుగురూ నడిచే బాటను కాక, ఒంటరిగా మరో కాలిబాటన నడిచివెళ్లే ధైర్యం లేకనే

చాలామంది విడాకులు కోరుకోవటం లేదు... కనుక ఇన్ని విషయాలు ఇందులో ముడిపడి వున్నందున విడాకులు తీసుకోవటానికి మనం వెనకాడుతున్నాం. చట్టం అనేది ఒక నిఘా మాత్రమే... అది మనమీద మనం పెట్టుకున్న నిఘా..." అని ముగించింది నళిని.

అందరూ ఆమె చెప్పిన విషయాలు బావున్నాయన్నారు. కొందరు మాత్రం 'మీరు చెప్పిన దాని సారాంశం ఏమిటి? మాకేం అర్థం కాలేదు' అన్నారు.

ఒకమ్మాయి మాత్రం దగ్గరకొచ్చి 'దమ్ముంటే విడాకులు తీసుకొని ధైర్యంగా నిలబడాలని నలుగురికి చెప్పండి. లేకపోతే మాట్లాడకుండా ఊరుకోండి... అంతేగాని పిరికిమందు నూరి పోయకండి...' అన్నది ఆవేశంగా.

నళిని ఎవరికీ ఏ సమాధానమూ చెప్పలేదు.

చెప్పి వాళ్లందర్నీ ఒప్పించగల ధైర్యం ఆమెకు లేదు.

ఇంటికి వెళ్తూ అనుకుంది 'ఈ వేళ ఈ సదస్సు జరగకపోయినా బావుండేది... వెళ్లినా ఒక మూల కూర్చుని వాళ్లు చెప్పేది వినకుండా, వేదిక ఎక్కటం పొరపాటు...'

నిజానికి అందరికీ చెప్పగల స్థితిలో ఉందా తను? తన జీవితాన్ని చక్కదిద్దుకోలేని దుర్బలమైన పరిస్థితిలో ఉన్న తను ఉపన్యాసాలు ఇవ్వటమా?

నళిని దీర్ఘంగా నిట్టూర్చింది.

ఇంటికి వచ్చి తాళం తీసి లోపలికి వెళ్లేటప్పటికి సుధీర్ వీల్‌ఛెయిర్‌లో పడుకునే నిద్రపోతున్నాడు. అలా కుర్చీలో కూర్చుని నిద్రపోవటం అలవాటు చేసుకున్నాడు.

'అలవాటంటే మరేం లేదు. పొరపాటు పనినే పదే పదే చేస్తుంటే అలవాటు అయిపోతుంది' అంటాడు సుధీర్.

ఎంత సీరియస్ విషయాన్ని అయినా తేలికగా తీసుకోవటం నేర్చుకున్నాడు.

నళిని వచ్చిన అలికిడి విని సుధీర్ నిద్రలేచాడు.

'నిద్రపోతున్నారా?' అని అడిగింది నళిని.

'జీవితం చక్రాల కుర్చీకి పరిమితమైపోయాక... నిద్రకూ, మెలకువకూ పెద్ద తేడా ఏముంది?' అన్నాడు సుధీర్.

నళిని ప్రేమగా.. జాలిగా... బాధగా.. చూస్తూ భర్త జుట్టులోకి వేళ్లు పోనిచ్చి తల నిమిరింది.

"ఆలస్యమైంది... భోంచేద్దాం రండి" అంది నళిని.

"నేను రాలేను... నువ్వేరావాలి నా దగ్గరకు... భర్త దగ్గరకు భార్య రావటం సహజం కదా..." మొదటి మాటల్లో బాధ ఉంది... తరువాత మాటల్లో ఆ బాధను మరిపించే స్వభావం కనిపిస్తుంది.

నళిని కంచంలో అన్నీ వడ్డించి తెచ్చి భర్త ముందున్న చిన్న టేబులు మీద పెట్టింది. నళిని పక్కన నిలబడి కూర కలుపుతుంటే సుధీర్ అన్నాడు.

"నేను కలుపుకొంటానే... నళినీ... నేను చేసుకోలేని పనుల కోసం నీమీద ఆధారపడక తప్పటం లేదు. నేను చేయగలిగిన పనులు అయినా నన్ను చేసుకోనీ..." ఆన్నాడు సుధీర్.

"భర్త అనుక్షణం తన అవిటితనాన్ని గుర్తు చేసుకుంటూనే ఉంటాడు. చివరికి తన చేతగానితనం మీద తనే జాలిపడుతూ... తనే జోక్స్ వేసుకుంటుంటే... నళిని గుండెను ఎవరో బ్రద్దలుకొడుతున్నట్లు ఉంటుంది.

"నేను ప్రేమగా కలిపి పెడుతుంటే మీరు బుద్ధిగా చిన్నపిల్లాడిలా తినాలి..." అన్నద నళిని.

"చిన్న పిల్లాడు కూడా పరుగులు పెడతాడు, నేను కదల్లేను కదా.."

"ఆ విషయం మర్చిపోవటానికి ప్రయత్నిస్తున్నాను. మీరు అనుక్షణం గుర్తు చేస్తుంటారు... ఇలాగైతే నేను ఈ ఇంట్లో ఉండలేను..." అన్నది నళిని కోపంగా.

"పోనీ, అలా కోపం వచ్చి వెళ్లిపోతావేమో ననుకుంటే.. అదీ అడియాసే అవుతోంది..." అన్నాడు సుధీర్.

వాళ్లిద్దరిదీ విచిత్రమైన బంధం.తన బతుకు ఎలాగూ అవిటి బతుకు అయిపోయింది... విడాకులు ఇచ్చి... మరో వివాహం చేసుకోమని సుధీర్ భార్యకు చెబుతున్నాడు. ఆ మాట ఎత్తినప్పుడల్లా ఆమె ఏడుస్తుంది. అతన్ని నోరెత్తవద్దని ప్రేమగా కసురుకుంటుంది.

నళిని, సుధీరలది ప్రేమ వివాహం. చిలకా గోరింకల్లా ఎంతో అన్యోన్యంగా చక్కగా,చూడముచ్చటగా, మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉండేవారు.

పెళ్లి పీటల మీద కూర్చున్నప్పుడు సుధీర్ అన్నాడు రహస్యంగా..

అందరి దృష్టీ నీ మీదే ఉంది..."

"నాకు కావలిసింది నీ దృష్టి. అది మాత్రం నా మీద లేదు..మిగిలిన అందరిమీదకూ పాకుతోంది.." అన్నది నళిని.

సుధీర్ కనపడకుండా నళినిని గిల్లాడు. అది చూసిన పురోహితుడు నవ్వుకున్నాడు. "అమ్మా మీరు గిల్లికజ్జాలు ఆడుకునేందుకు ముందు ముందు బోలెడంత సమయం ఉంది. ప్రస్తుతానికి వివాహ వేడుక కానివ్వండి" అన్నాడు.

"కానివ్వండి, కానివ్వండి... మీదే ఆలస్యం.. " అన్నాడు సుధీర్.

అవన్నీ గుర్తొచ్చి నళిని నవ్వుకుంది.

సుధీర్ దేనికి నవ్వుతున్నావన్నాడు. 'ఏం లేదు' అన్నది పొడిగా.

సుధీర్‌ని బెడ్‌రూంలోకి తీసుకెళ్లింది.

అతను బెడ్‌మీదకు మారేందుకు సాయం చేసింది. కాళ్లమీద లుంగీ సరిగ్గా కప్పి పక్కన కూర్చుంది.

రెండేళ్ల కిందట ఇదే నెలలో.. ఇదే రోజున హనీమూన్‌కు బయల్దేరుతున్నారు.

"ఏ ఊరికి వెళ్తున్నామో తెల్సా?" అని అడిగాడు సుధీర్.

"తెలియదు" అన్నది నళిని సిగ్గుతో తలొంచుకొని.

"పోనీ హనీమూన్‌కు ఎందుకెళ్తున్నామో తెల్సా?" అని అడిగాడు కళ్ళతోనే నవ్వుతూ.

"ఛీపో.." అన్నది తల తిప్పుకుంటూ.

"అయితే నేనొక్కడినే వెళ్లనా మరి?" అని అడిగాడు.

అవన్నీ గుర్తొచ్చి నవ్వుకుంటే "దేనికో ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నావు... నాకు చెప్పకూడని విషయాలా? " అని అడిగాడు.

"నాకు మిగిలింది గతం ఒక్కటే. మనం ఆనందంగా గడిపిన ఆ ఏడాది కాలాన్ని తల్చుకుంటూ ఉంటాను. ఆ జ్ఞాపకాలే.. వర్తమానం.. ఆ జ్ఞాపకాలే.. నాకు మిగిలిన భవిష్యత్తు..." అన్నది నళిని.

"ఇది దారుణం నళినీ.. నా వల్ల నీ జీవితం ఇలా మోడైపోయిన వృక్షంలా..." అంటున్న సుధీర్ నోటిని ఆమె తన చేత్తో మూసేసింది.

ఏడాది కిందట యాక్సిడెంట్ అయింది. ఇద్దరూ స్కూటర్‌మీద వస్తున్నారు. లారీ ఢీ కొట్టింది. నళిని ఎగిరి దూరంగా పడిపోయింది. కొద్దిపాటి దెబ్బలతో కోలుకుంది. సుధీర్‌కు బలంగా దెబ్బలు తగిలాయి. రెండు కాళ్లూ చితికిపోయాయి. అతని జీవితం చక్రాల కుర్చీకి పరిమితం అయింది.

నిండు జీవితం.. ఇలా ఎన్నాళ్లని.. విడాకులు తీసుకొని మరొకర్ని పెళ్లి చేసుకోమని అందరూ చెబుతున్నారు. నళిని మాత్రం వినటం లేదు. ఆ ప్రమాదంలో తనకే కాళ్ళుపోయి, సుధీర్ క్షేమంగా ఉండి ఉంటే...

"అలా ఉండి ఉంటే అతను నిముషాల మీద మరొకతెను పెళ్లి చేసుకునేవాడు." అంటుంది నళిని తల్లి.

"పెళ్లి చేసుకున్నాక ఎన్నో అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగొచ్చు. వాటన్నిటిని మామూలు సంఘటనలుగా తీసుకోవాలి.." అంటుంది నళిని.

"చట్ట ప్రకారం నళిని విడాకులు తీసుకోవచ్చు" అని ప్లీడరు చెప్పాడట. "చట్టంలో ఏముందో నాకు తెలియదు. నా భర్త మీద నాకెంత ప్రేమ ఉందో చట్టానికి తెలియదు" అంటుంది నళిని. నీకు విడాకులు తీసుకునే హక్కు ఉంది అంటాడు తండ్రి. సంప్రదాయం కోసం హక్కులు వదులుకోవటానికే ఇష్టపడుతుందామె.

"నన్ను పెళ్లి చేసుకుని పొరపాటు చేశావు నళినీ" అంటాడు సుధీర్.

"అవును.. అసలు పెళ్లి చేసుకోవటమే పెద్ద పొరపాటు... కానీ ప్రతివాళ్లూ ఆ పొరపాటు చేస్తూనే ఉంటారు.." అంటుంది నళిని. భర్త దగ్గర నుంచి అందరూ ఆమెను విడాకులు తీసుకోమని పోరు పెడుతున్నా ఆమె మాత్రం 'వద్దు' అంటుంది.

సుధీర్ నిద్రపోయాడు. ఏదో ఆలోచిస్తూ నళిని కూడా పక్కనే ఒరిగి నిద్రపోయింది.

కల.. పీడకల.. సుధీర్ తన సుఖం కోసం... పురుగుల మందు తిని చనిపోయినట్లు తాను ఘొల్లున ఏడుస్తున్నట్లు కల...

వెక్కి వెక్కి ఏడుస్తున్న నళినిని సుధీర్ తట్టి లేపాడు.

"దేనికి ఏడుస్తున్నావు?"

"పీడకల వచ్చింది.."

"నా మీదనా..."

"కాదు.. నా మీదనే..." అన్నది నళిని కన్నీరు తుడుచుకుంటూ..

--------

.

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.